తీగల.. టీడీపీలోకి పయనం వెనక..

- నాలుగు నెలలకే కాంగ్రెస్‌ను వీడడంపై భిన్న వాదనలు
- ఆ పార్టీలో ఆశావహులు ఎక్కువగా ఉండడంతోనే గుడ్‌బై!
- గతంలో ఎమ్మెల్యేను చేసిన పార్టీలోకే మళ్లీ..

సరూర్‌నగర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి పార్టీ ఫిరాయింపు వ్యవహారం నియోజకవర్గం వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. 2023 అసెంబ్లీ ఎన్నికల దాకా అప్పటి అధికార బీఆర్‌ఎస్‌లోనే కొనసాగిన తీగల.. ఆ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఘోర పరాజయం, కాంగ్రెస్ అధికారం చేజిక్కించుకోవడంతో కారు దిగి హస్తం గూటికి చేరిన సంగతి తెలిసిందే. జూన్ మొదటి వారంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న ఆయన.. కేవలం నాలుగు నెలల్లోనే ఆ పార్టీకి గుడ్‌బై చెప్పడం సర్వత్రా ఆసక్తికర అంశంగా మారింది. తాజాగా ఆయన టీడీపీలో చేరాలని నిర్ణయించుకున్నట్టు అక్టోబరు మొదటి వారంలో చంద్రబాబును కలిసిన అనంతరం బహిరంగంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. టీడీపీలో చేరి తెలంగాణలో ఆ పార్టీకి పూర్వ వైభవం తీసుకువస్తామని తీగల పేర్కొన్నారు కూడా. దాంతో ఆయన కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చినట్టేనని స్పష్టమవుతోంది.

ఆశలు సన్నగిల్లడంతోనే..!

తీగల కృష్ణారెడ్డి 2014లో టీడీపీ తరఫున మహేశ్వరంలో పోటీ చేసి గెలుపొందిన సంగతి తెలిసిందే. అయితే అప్పట్లో బీఆర్‌ఎస్ అధికారం దక్కించుకోవడంతో అభివృద్ధి పేరుతో ఆయన కేసీఆర్ సమక్షంలో గులాబీ గూటికి చేరారు. 2018 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేయగా, కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన సబితారెడ్డి చేతిలో పరాజయం పాలయ్యారు. ఆ తర్వాత చోటుచేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో సబిత సైతం గులాబీ గూటికి చేరుకోవడంతో తీగల పరిస్థితి అయోమయంగా మారింది. అప్పటి నుంచి వారి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు తలెత్తాయి. దాంతో ఆయన బీజేపీలోకి గానీ, కాంగ్రెస్‌లోకి గానీ వెళ్లాలనే ఆలోచనతో ఆయా పార్టీల నేతలతో అప్పట్లో చర్చలు సైతం జరిపినట్టు వార్తలు వచ్చాయి. పైగా ఓటమి తర్వాత ఎమ్మెల్సీ పదవి ఇస్తామని చెప్పి ఆ హామీ అమలు చేయకపోవడంతో బీఆర్‌ఎస్‌పై ఆయన కినుక వహించిన సంగతి విదితమే. ఇక 2023 ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్ తరఫున టికెట్ కోసం శతవిధాలా ప్రయత్నించినా ఆయనకు అవకాశం దక్కలేదు. సొంత పార్టీలోనే ప్రత్యర్థిగా భావిస్తున్న సబితకే మళ్లీ టికెట్ ఇవ్వడంతో ఆయన ఆ పార్టీకి దూరమవ్వాలని నిర్ణయించుకున్నారు. ఎన్నికల దాకా ఓపిక పట్టిన ఆయన.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో జూన్‌లో హస్తం గూటికి చేరారు. కాగా మహేశ్వరం నుంచి పోటీ చేయాలనే ఉత్సుకతతో ఉన్న ఆయన.. ఇక్కడ ఆశావహులు ఎక్కువగా ఉండడంతో తనకు టికెట్ దక్కే అవకాశాలు ఏమాత్రం లేవని గ్రహించారు. ఓ వైపు మొన్నటి ఎన్నికల్లో ఓడిపోయిన కేఎల్లార్.. మరోవైపు మొన్నటి ఎన్నికల్లో చివరి నిమిషంలో టికెట్ చేజారిన బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డితో పాటు టఫ్‌ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, టీపీసీసీ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి, యెల్లేటి అమరేందర్‌రెడ్డి, జంగారెడ్డి తదితర ఆశావహులు సైతం రేసులో కొనసాగుతున్నందున ఇక తనకు టికెట్ రావడం కష్టమేనని తీగల అర్థం చేసుకున్నారని విశ్లేషకులు పేర్కొంటున్నారు. తిరిగి బీఆర్‌ఎస్‌లోకి వెళ్దామనుకున్నా అక్కడ సబితారెడ్డి పట్టుబిగించడంతో అక్కడా తనకు అవకాశం రాదని ఆయనకు తెలిసిపోయిందంటున్నారు.

మళ్లీ టీడీపీ తరఫున మహేశ్వరం నుంచి పోటీ?

తనకు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యే అదృష్టం టీడీపీలోనే ఉన్నదని తీగల భావిస్తున్నట్టు తెలిసింది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీల నుంచి పోటీ చేసే అవకాశం రాదని, ఒకవేళ వచ్చినా గెలిచే అదృష్టం ఉండకపోవచ్చునని ఆయన అనుకుంటున్నట్టు సమాచారం. గతంలో (2014లో) టీడీపీ నుంచే తాను మొదటిసారిగా ఎమ్మెల్యేగా గెలిచినందున మరోసారి ఆ పార్టీ నుంచే అదృష్టం పరీక్షించుకోవాలని భావిస్తున్నట్టు తెలిసింది. తెలంగాణలో పార్టీని పటిష్టం చేసి వచ్చే ఎన్నికల్లో కొన్ని



చంద్రబాబునాయుడు | తీగల కృష్ణారెడ్డి

స్థానాల్లో అభ్యర్థులను గెలిపించుకుని టీడీపీకి పూర్వ వైభవం తీసుకురావాలని చంద్రబాబు సైతం భావిస్తున్న క్రమంలోనే తీగల ఆ పార్టీలోకి జంప్ కావడం గమనార్హం! మహేశ్వరం టికెట్‌పై కచ్చితమైన హామీ తీసుకున్న తర్వాతే ఆయన ఆ పార్టీలోకి వెళ్లినట్టు ప్రచారం జరుగుతోంది. ఏది ఏమైనా తీగల నాలుగు నెలల్లోనే కాంగ్రెస్‌ను వీడడం ఆ పార్టీలోని అంతర్గత విబేధాలను బహిర్గతం చేస్తున్నదని, కాంగ్రెస్‌లో కొనసాగుతున్న నాలుగైదు గ్రూపులే తీగల మనస్సు మార్చి ఉంటాయని పరిశీలకులు భావిస్తున్నారు. మరి ఆయన టీడీపీలో ఏ మేరకు రాణించగలుగుతారు.. మహేశ్వరం నుంచి టికెట్ వస్తే ఓటు బ్యాంకును ఎలా కూడగట్టుకుంటారన్నది వేచి చూడాల్సిందే..!



మూసీ పరీవాహక ప్రాంతవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

పేదల జోలికి వస్తే.. బుల్డోజర్లకు అడ్డంగా నిలబడతా

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): బుల్డోజర్లతో పేద ప్రజలకు అన్యాయం చేస్తామంటే.. బుల్డోజర్లకు అడ్డంగా నిలబడతామని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. చైతన్యపురి డివిజన్ పరిధిలోని ద్వారకాపురం కాలనీ మూసీ పరీవాహక ప్రాంతవాసులతో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ఒక్కరు కూడా అధైర్య పడొద్దని ప్రతి ఒక్కరికీ బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని హామీనిచ్చారు. రేవంత్‌రెడ్డి సర్కారు తమ ఇళ్లను ఎప్పుడు కూలుస్తుందో అని చాలామంది కంటిమీద కునుకు లేకుండా బిక్కుబిక్కుమంటూ గడుపుతుండడం కలచివేస్తుందన్నారు. అధికారులు ఎలాంటి మార్కింగులు వేసినా, అన్యాయం జరగకుండా తాను అడ్డుకుంటానని ఆయన భరోసానిచ్చారు. ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాల్సిన ప్రభుత్వం ఇష్టానుసారంగా కూల్చివేతలకు పూనుకోవడం సిగ్గుచేటన్నారు. పేదల బతుకులతో చెలగాటం ఆడిన ప్రభుత్వాలు నేలకొరగడం ఖాయమని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం మాజీ ఫ్లోర్‌లీడర్ పులిపాలి త్రివేది, మాజీ కార్పొరేటర్ విఠల్‌రెడ్డి, చైతన్యపురి డివిజన్ అధ్యక్షుడు తోట మహేష్‌యాదవ్, సీనియర్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, మోహన్‌రాజ్, అజయ్, కృష్ణ, రమణారెడ్డి పాల్గొన్నారు.



కార్పొరేటర్ లచ్చిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

పార్కులను అభివృద్ధి చేస్తాం : లచ్చిరెడ్డి

వనస్థలిపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పార్కులను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకవస్తామని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సచివాలయనగర్ కాలనీలోని హెచ్ఎండీఏ పార్కులో వీధి దీపాలు, వాష్ రూమ్స్, వాకింగ్‌ట్రాక్, ఓపెన్ జిమ్ తదితర వాటిపై సరైన నిర్వహణ లోపాలు లేకుండా నూతన పరికరాలను ఏర్పాటు చేయాలని వాకర్స్ ఆదివారం కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వాకర్స్‌కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నూతన పరికరాలను ఏర్పాటు చేసి అందుబాటులోకి తీసుకవస్తామన్నారు. కార్యక్రమంలో వాకర్స్ కాలనీవాసులు పాల్గొన్నారు.



సీనియర్ సిటిజన్స్ సంఘం వనమహోత్సవంలో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి


సీనియర్ సిటిజన్ల అనుభవాలు యువతతో పంచుకోవాలి

మన్సూరాబాద్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నేటి యువత సన్మార్గంలో నడవడంలో సీనియర్ సిటిజన్ల అనుభవాలు ఎంతో తోడ్పడుతాయని, కాబట్టి వారి అనుభవాలను అనునిత్యం యువతతో పంచుకోవాలని కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. కార్తీక మాసంను పురస్కరించుకుని ఆసరా హయత్‌నగర్ సర్కిల్-3 సీనియర్ సిటిజన్స్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం హరిణి వనస్థలి డీర్ పార్క్ ఆవరణలో కార్తీక వనభోజన మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కొప్పుల నర్సింహారెడ్డితో పాటు బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్లు చింతల అరుణాసురేందర్‌యాదవ్, కళ్లెం జీవన్‌రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేందర్‌యాదవ్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ సభ్యులు పాటి యాదిరెడ్డి, హరినాథ్‌బాబు, ధీర నారాయణ, నర్సింహారెడ్డి, జల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కార్పొరేటర్ కొప్పులకు కృతజ్ఞతలు

మన్సూరాబాద్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): చెత్త సేకరణ రిక్షా లేక రోజుల తరబడిగా మన్సూరాబాద్ డివిజన్ శ్రీసరస్వతికాలనీలో ఎక్కడ పడితే అక్కడ చెత్తా చెదారం ఉండేది. దీంతో కాలనీలో నెలకొన్న సమస్యను స్థానిక కార్పొరేటర్, జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆ రిక్షాను ఆదివారం కాలనీకి అందించారు. ఈ సందర్భంగా శ్రీసరస్వతికాలనీ సంక్షేమ సంఘం సభ్యులు కార్పొరేటర్‌ను శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీసీలు ఐక్యంగా రాజ్యాధికార సాధనకు పోరాడాలి



పూలే, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేస్తున్న ఎల్బీనగర్ బీసీ నేతలు

మన్సూరాబాద్ : బీసీ కులాలకు చెందిన వారంతా ఐక్యంగా రాజ్యాధికారం సాధించేందుకు పోరాడాలని మాజీ ఐఏఎస్ అధికారి, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం కన్వీనర్ టి.చిరంజీవులు పిలుపునిచ్చారు. బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం మిర్యాలగూడలో నిర్వహించ తలపెట్టిన బీసీ గర్జనకు ఎల్బీనగర్ నుంచి పలువురు బీసీ నేతలు ఎల్బీనగర్‌లోని మహాత్మాజ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం తరలివెళ్లారు. బీసీ డాక్టర్ల ఫోరం కన్వీనర్ డాక్టర్ ఆలేటి శ్రీనివాస్‌గౌడ్, సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు చామకూర రాజు, తెలంగాణ ఇన్‌చార్జి కేవీగౌడ్, జాతీయ స్పోక్స్ పర్సన్ వేముల కొండల్‌గౌడ్, చెన్న శ్రీకాంత్, బొమ్మ రఘురాం, బీసీ జేఏసీ చైర్మన్ అవ్వారు వేణుకుమార్, వెంకటేశ్, అశోక్, వాసుదేవ్ పటేల్ పాల్గొన్నారు.

భయపడొద్దు.. అండగా ఉంటాం : సీపీ సుధీర్‌బాబు

- రుణయాప్ మోసాలపై పోలీసులకు ఫిర్యాదు చేయండి
- ఆన్‌లైన్ లోన్ యాప్‌ల ద్వారా రుణాలు తీసుకోవద్దు

హైదరాబాద్ సిటీ, నవంబర్ 3(ఆంధ్రజ్యోతి): లోన్ యాప్‌ల ద్వారా చిన్న మొత్తాలు తీసుకున్న వారిని యాప్‌ల నిర్వాహకులు వేధింపులకు గురిచేస్తే పోలీసులకు లేదా 100 లేదా 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని రాచకొండ సీపీ సుధీర్‌బాబు అన్నారు. లోన్ యాప్ నిర్వాహకుల వేధింపుల బారినపడి కొందరు ఆత్మహత్యలు చేసుకున్నారని.. బాధితులు ధైర్యంగా ముందుకు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. లోన్ యాప్‌ల వేధింపుల బారినపడ్డవారికి పోలీసులు అండగా ఉంటారని తెలిపారు. చిన్న మొత్తాలు అవసరమైన వారు ఆన్‌లైన్‌లో ఉన్న లోన్ యాప్‌ల ద్వారా రుణం తీసుకుంటున్నారు. ఈ యాప్‌లను ఇన్‌స్టాల్ చేసే సమయంలో ఫోన్‌లకు సంబంధించి అన్ని నియంత్రణలు యాప్ నిర్వాహకులు తీసుకుంటారు. ఎలాంటి పత్రాలు లేకుండా చిన్న మొత్తాల్లో లోన్ ఇస్తారు. లోన్ తీసుకున్న వారి మొబైల్ నుంచి ఫొటోలు, ఫోన్ నెంబర్లు సేకరిస్తారు. వేలల్లో రుణం ఇచ్చి లక్షల్లో డబ్బు డిమాండ్ చేస్తారు. డబ్బు ఇవ్వని పక్షంలో ఫోన్ నుంచి సేకరించిన ఫొటోలను మార్ఫింగ్ చేసి, అసభ్యకరంగా మార్చుతారు. ఈ ఫొటోలు సోషల్ మీడియాలో పెడతాం, స్నేహితులకు బంధువులకు పంపుతామంటూ బెదిరింపులకు దిగుతారు. వారి వేధింపులు తట్టుకోలేక పలువురు ఆత్మహత్యలు చేసుకున్నారు. లోన్‌యాప్ నిర్వాహకులు బెదిరింపులకు పాల్పడితే భయపడకుండా పోలీసులను సంప్రదించాలని సీపీ సూచించారు. భయం వద్దు.. భరోసాగా ఉంటామని సీపీ హామీ ఇచ్చారు.



సీపీ సుధీర్‌బాబు

ప్రజల రక్షణ కోసమే పోలీసులు : డీసీపీ పాటిల్

సైదాబాద్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రజల రక్షణ కోసమే నిరంతరం పోలీసులు పనిచేస్తున్నారని, ఏమైన సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్ తెలిపారు. ఆదివారం సైదాబాద్ పోలీస్‌స్టేషన్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ముస్లిం మతపెద్దలతో సమావేశం నిర్వహించారు. ముఖ్యం గా యువత పక్కదారులు పట్టకుండా మతపెద్దలు చొరవ చూపాలని కోరారు. పోలీసులు, అన్నివర్గాల మధ్య పరస్పరం కలిసి పనిచేస్తే శాంతిభద్రతలు కాపాడుకోచ్చని అన్నారు. సమాజంలో నేరాలు జరిగితే కేవలం పోలీసులదే బాధ్యత అనుకోవడం తప్పని అభిప్రాయపడ్డారు. ప్రజలు చైతన్యవంతులై సంఘటితంగా పోలీసులకు సహకరి స్తే నేరాలు పూర్తిగా అదుపుచేయవచ్చని సూచించారు. ఏరియాలో పోలీసుల గస్తీ మరింతగా పెంచాలని, రాత్రివేళలలో ఇష్టారాజ్యంగా సంచరించే యువతకు పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించాలని, అవసరమైతే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని పలువురు మతపెద్దలు సూచించారు. సమావేశంలో సైదాబాద్ ఏసీపీ వెంకన్ననాయక్, ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్, డీఐ ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



మాట్లాడుతున్న డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్

ఎల్ఐసీ కాలనీలో సైదాబాద్ పోలీసులు, కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైం నిపుణులు అనంత పద్మనాబన్ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ పూర్తిగా అవగాహన ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు తమ వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని చెప్పారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 టోల్‌ఫ్రీ నెంబరుకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్, కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

డిసెంబరు 1 వరకు కార్తీక మాసోత్సవాలు : ఈఓ

చంపాపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో దేవాదాయ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాల మేరకు డిసెంబరు 1 వరకు కార్తీక మాసోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఎస్.లావణ్య తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం 6గంటలకు ఆకాశ దీపారాధన, సామూహిక కార్తీక దీపోత్సవం, ప్రతి రోజు ఆలయంలో సత్యనారాయణస్వామి వ్రతాలు, విష్ణు సహస్రనామ పారాయణం, ప్రతి సోమవారం మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు. ప్రతి సోమవారం సాయంత్రం సామూహిక దీపోత్సవంలో పాల్గొనే మహిళా భక్తులకు తాంబులములు, ప్రసాదం అందజేయనున్నట్లు ఈఓ పేర్కొన్నారు. సమయానుకూలంగా ఆలయంలో భక్తుల కోసం ప్రవచనాలు, కార్తీక పురాణం, హరికథా కాలక్షేపం, యక్షగానం, కోలాటం, కూచిపూడి నృత్యం, వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈనెల 7న ఆలయంలో ఛట్‌పూజలు, 15న కార్తీక పౌర్ణమిని పురష్కరించుకొని కోనేరు వద్ద దీపోత్సవం, హారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు.



ఆకాశ దీపారాధన కార్యక్రమంలో ఆలయ ఈఓ లావణ్య

ఘనంగా ఆకాశ దీపారాధన

హనుమాన్ ఆలయంలో శనివారం రాత్రి కార్తీక మాసోత్సవాలను పురష్కరించుకొని ఆకాశ దీపారాధన కార్యక్రమాన్ని ఘనంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎస్.లావణ్య, భక్తులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ పనులు ప్రారంభం

సరూర్‌నగర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలో ప్రజలెదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తున్నట్టు మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి పేర్కొన్నారు. బడంగ్‌పేట్ 1వ డివిజన్‌లోని నవయుగ కాలనీలో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ పనులను ఆదివారం కార్పొరేటర్ పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా పారిజాత మాట్లాడుతూ మునిసిపల్ సాధారణ నిధులతో పాటు ఇతరత్రా అందుబాటులో ఉన్న నిధులతో అన్ని డివిజన్లలో ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పార్క్ ప్రహరీ..

నాదర్‌గుల్ 31వ డివిజన్‌లోని గ్రీన్‌రిచ్ ఎవెన్యూ కాలనీలో నిర్మించిన పార్క్ ప్రహరీని ఆదివారం మేయర్ పారిజాతానర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీలకతీతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు రావినూతల రమాకాంత్, డాక్టర్ జి.లక్ష్మీనారాయణ, ఎం.ఆనంద్, రవీందర్‌రెడ్డి, రాజేశ్, సురేశ్, మోహనకృష్ణ లక్ష్మి, విద్య పాల్గొన్నారు.



కమ్యూనిటీహాల్ పనులను ప్రారంభిస్తున్న మేయర్ పారిజాతారెడ్డి

విద్యుత్‌ను ఆదా చేస్తే ఉత్పత్తి చేసినట్లే : ఎస్ఈ

ఎల్బీనగర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌ను ఆదా చేస్తే విద్యుత్‌ను ఉత్పత్తి చేసినట్లేనని టీజీఎస్‌పీడీసీఎల్ సరూర్‌నగర్ సర్కిల్ ఎస్ఈ మాధవరెడ్డి అన్నారు. విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలో విద్యుత్ వినియోగదారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారుల సమస్యలను తెలుసుకున్నారు. పలువురు వినియోగదారులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. వినియోగదారులు టీజీఎస్‌పీడీసీఎల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ప్రతి నెల బిల్లులు చెల్లించడంతో పాటు ఏ సమస్యలున్నా యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. తమ సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు. ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తెగిపడితే దగ్గర్లోని విద్యుత్ అధికారులకు సమాచారం అందించాలని ఆయన సూచించారు. వినియోగదారులు నాణ్యత గల పరికరాలను కొని విద్యుత్‌ను ఆదా చేయాలని సూచించారు. నాణ్యతగల కెపాసిటర్లను ఉపయోగిస్తు విద్యుత్‌ను ఆదా చేయాలన్నారు. విద్యుత్‌ను పొదుపుగా వాడి సకాలంలో బిల్లులు చెల్లించి మెరుగైన సేవలను పొందాలన్నారు. విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమన్నారు. ఈ సమావేశంలో రాతపూర్వకంగా ఆరు ఫిర్యాదులు రాగా మౌఖికంగా నాలుగు ఫిర్యాదులు వచ్చాయి. కేవలం నవంబరు 3నే కాకుండా ఎప్పుడు సమస్య వచ్చిన తమ దృష్టికి తెస్తే అప్పటికప్పుడు పరిష్కరిస్తామని ఆయన చెప్పారు. అంతే కాకుండా 1912 సేవలను కూడా వినియోగించుకోవాలన్నారు. ఎస్ఈ, డీఈల స్థాయిలో సమస్యలు పరిష్కారం కాకపోతే 04023431228లో వినియోగదారుల గ్రీవెన్స్ సెల్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. సమావేశాలలో డీఈ రాజరాంరెడ్డి, ఎస్ఏఓ రమణారెడ్డి, ఏడీఈ విజయ్‌భాస్కర్, ఏఈలు శ్రీనివాసచారి, నాగరాజు, శంకర్, ఎండీ పాషాఖాద్రీ పాల్గొన్నారు.



వినియోగదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న టీజీఎస్‌పీడీసీఎల్ సరూర్‌నగర్ ఎస్ఈ మాధవరెడ్డి

ప్రజల భాగస్వామ్యంతో ప్రణాళికాబద్ధంగా

తుర్కయంజాల్ మున్సిపాలిటీ అభివృద్ధి

- కమిషనర్ కందుల అమరేందర్‌రెడ్డి



హయత్‌నగర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీలో పరిసరాల పరిశుభ్రత, పన్నుల వసూలు, అభివృద్ధి పనుల్లో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరం అని తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్ కందుల అమరేందర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలోనే అతిపెద్ద మున్సిపాలిటీ అయిన తుర్కయంజాల్‌లో అభివృద్ధి వేగంగా జరుగుతుందని పేర్కొన్నారు. ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు ముందుకు సాగడం జరుగుతుందన్నారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, తుర్కయంజాల్ మున్సిపల్ చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధారాంరెడ్డి, పాలకవర్గం సభ్యులు, అధికారులు, సిబ్బంది సహకారంతో అభివృద్ధిలో దూసుకుపోతున్నామని తెలిపారు.

ఈ ఇంటర్వ్యూ

మున్సిపాలిటీ అభివృద్ధి విషయంలో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

తుర్కయంజాల్ మున్సిపాలిటీ 74 స్క్వేర్ కిలోమీటర్లు విస్తరించి ఉంది. 9 గ్రామాలతో ఏర్పడిన పెద్ద మున్సిపాలిటీ తుర్కయంజాల్. హైదరాబాద్ నగరాన్ని ఆనుకుని వేగంగా అభివృద్ధి చెందుతుంది. అవసరం ఉన్న మౌలిక సదుపాయాలను ప్రజలకు అందిస్తు ముందుకు సాగుతున్నాం. భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్లు, వీధి లైట్లు, పార్కుల అభివృద్ధి, కమ్యూనిటీ హాల్‌ల నిర్మాణం, సక్రమంగా చెత్త సేకరణ, పరిసరాల పరిశుభ్రత లాంటి కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నాం.

శానిటేషన్ నిర్వహణ ఎలా ఉంది?

9 గ్రామాల కలియకతో ఏర్పడిన మున్సిపాలిటీలో సుమారు 170 మంది శానిటేషన్ సిబ్బంది పని చేస్తున్నారు. ఇంకా 40మంది సిబ్బంది అవసరం ఉంది. పాలకవర్గం అనుమతితో త్వరలో నియామకాలు చేపడుతాం. చెత్త ఎత్తేందుకు కాంట్రాక్టర్ల సహకారం తీసుకుంటున్నాం. స్వచ్ఛ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నాం. ప్రత్యేక డ్రైవ్‌తో పరసరాల పరిశుభ్రత చేపడుతున్నాం. ప్రతి వార్డుకు రూ. 2లక్షలు ఖర్చు చేసి రోడ్ల వెంట చెత్తా, రోడ్ల మరమ్మతులు చేస్తున్నాం.

మున్సిపాలిటీలో పన్నుల వసూలు ఎలా ఉంది?

క్రమం తప్పకుండా పన్నులు వసూలు చేస్తున్నాం. ఇప్పటికే 60 శాతం పన్నులు వసూలు చేశాం. మరో 40 శాతం వసూలు చేయాల్సి ఉంది. త్వరలో టార్గెట్ పూర్తి చేస్తాం. ప్రతి సంవత్సరం 90 శాతానికి పైగా పన్నులు వసూలు చేస్తున్నాం.

ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు ఎలా ఉంది?

మున్సిపాలిటీలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నాం. ఎమ్మెల్యే, చైర్‌పర్సన్, వార్డు కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది సహకారంతో సంక్షేమ పథకాలు అమలు జరుగుతుంది. ఇటీవలే ఇందిరమ్మ కమిటీలు వేశాం. మహిళా స్వశక్తి సంఘాలను బలోపేతం చేస్తున్నాం. బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తున్నాం. మెప్మా ద్వారా మరిన్ని పథకాలను అమలు చేస్తున్నాం.

మున్సిపాలిటీ ప్రజలకు మీరు ఏమి చెప్పాలనుకుంటున్నారు?

ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యం అవుతుంది. మున్సిపాలిటీ అభివృద్ధి, శానిటేషన్, పన్నుల వసూలు, వనమహోత్సవం లాంటి విషయాల్లో ప్రజలు పూర్తిగా సహకరించాలి. ప్రతి సంవత్సరం గృహ యజమానులు, వ్యాపారులు క్రమం తప్పకుండా ట్యాక్సులు చెల్లించాలి. సమస్యలను కూడా అధికారుల దృష్టికి తీసుకురావాలి. ప్రతి ఒక్కరూ ఇంటికో మొక్క నాటాలి, పరసరాల పరిశుభ్రత పాటించాలి.



కమ్మ కుటుంబీకుల వన సమారాధన మహోత్సవంలో ఎమ్మెల్యే ఆంజనేయులు

కమ్మలు ఐక్యంగా అన్ని రంగాల్లోనూ రాణించాలి

- వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

మన్సూరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కమ్మ కులస్థులు ఐక్యంగా పోరాడితే ప్రతి రంగంలో రాణించగలుగుతారని, ఆ దిశగా కమ్మ కులానికి చెందిన ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సూచించారు. కమ్మ కుటుంబం ఆధ్వర్యంలో ఆదివారం హరిణి వనస్థలి డీర్ పార్క్ ఆవరణలో కార్తీక మాస వన సమారాధన మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆంజనేయులుతో పాటు జాతీయ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, మాజీ ఎంపీ గరికపాటి రామ్మోహన్‌రావు, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శివశక్తి గ్రూపు వారి లీలా ఫౌండేషన్ ద్వారా ప్రతిభ కనబరిచే విద్యార్థులకు ఉన్నత చదువుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేస్తున్నామని, దీన్ని ప్రతి కమ్మ విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం అతిథులను కమ్మ సంఘం సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో స్త్రీ వైద్య నిపుణురాలు కోడె సుచరిత, న్యూరో సర్జన్ డాక్టర్ వంశీకృష్ణ, కమ్మపెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా కుమ్మరుల వనభోజన మహోత్సవం

మన్సూరాబాద్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంను పురస్కరించుకుని మన్సూరాబాద్ డివిజన్ సహారా రోడ్డులోని ఎంఈరెడ్డి గార్డెన్స్‌లో ఆదివారం కుమ్మరుల వనభోజన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కుమ్మర శాలివాహన ప్రజాపతి సంఘం తూర్పు హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో జరిగిన ఈ మహోత్సవంలో ఉసిరిచెట్టుకు పూజ, శివారాధన, కుల పూర్వీకుల ఆరాధనలతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శాలివాహన కుమ్మరులు ఐక్యంగా ఉంటూ అన్ని రంగాల్లో రాణించాలని కులపెద్దల సలహాలు, సూచనలు చేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, దాండియా అలరించాయి. ఎల్బీనగర్ జోన్ కుమ్మర సంఘం అధ్యక్షుడు తీగుళ్ల యాదగిరి, సభ్యులు ఎలిమినేటి నారాయణ, సిర్సవాడ అంజయ్య, ఎ.సూర్యనారాయణ, శివప్రసాద్, రమేష్, చంద్రశేఖర్, శ్రీశైలం పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షా శిబిరం

ఎల్‌బీనగర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆర్‌కేపురంలోని హరిపురికాలనీ పార్క్‌లో ఆదివారం ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. హరిపురికాలనీ వాసుల సంక్షేమ సంఘం, కాలనీ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో దిల్‌సుఖ్‌నగర్‌లోని సిటీ ఐ ఆస్పత్రికి చెందిన డాక్టర్ హిమబింధు, వైద్యసిబ్బంది 64 మందికి కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌రావు, కార్యదర్శి కృష్ణారావు, సంక్షేమ సంఘం కార్యదర్శి నోముల మురళి, కార్యవర్గసభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, హరిపురికాలనీ మహిళా మండలి కార్యదర్శి సరస్వతి వాణి, కోశాధికారి లక్ష్మి, రుక్మిణి పాల్గొన్నారు.

కాలనీలలో కుక్కల స్వైర విహారం

చంపాపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్‌లోని పలు కాలనీలు, బస్తీలలో కుక్కలు స్వైరవిహారం చేస్తూ చిన్నారులపై దాడులకు పాల్పడుతున్నా జీహెచ్ఎంసీ వారు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డివిజన్‌లోని మాధవనగర్‌కాలనీ, ఎస్వీకాలనీలలో రెండు రోజుల నుంచి పలువురు చిన్నారులపై కుక్కలు దాడులు చేసి తీవ్రంగా గాయపరిచాయి. శనివా రం ఎస్వీకాలనీలోని ఓ అపార్ట్‌మెంట్ బయట ఇద్దరు చిన్నారులపై కుక్కలు అకస్మాత్తుగా దాడులుచేయగా వారికి గాయాలైనాయి. జీహెచ్ఎంసీ అధికారులు వీధులలో తిరుగుతున్న కుక్కలను పట్టుకెళ్లాలని డివిజన్ ప్రజలు కోరుతున్నారు.

ఆటోలో బ్యాగ్ మర్చిపోయిన ప్రయాణికురాలు

- పోలీసులకు అప్పగించిన ఆటో డ్రైవర్.. అభినందించిన పోలీసులు



నిజాయితీ చూపిన ఆటోడ్రైవర్‌ను సత్కరిస్తున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

వనస్థలిపురం : ఆటోలో ప్రయాణికురాలు మర్చిపోయిన బ్యాగులను పోలీసులకు అప్పగించి నిజాయితీ చాటుకున్న ఆటోడ్రైవర్‌ను వనస్థలిపురం పోలీసులు అభినందించారు. సుమంజలి అనే మహిళ ఆదివారం సాయంత్రం హయత్‌నగర్ నుంచి వనస్థలిపురం వరకు ర్యాపిడో ఆటోలో ప్రయాణించింది. ఫోన్‌పే ద్వారా డబ్బులు చెల్లించిన మహిళ ఆటోలో తన బ్యాగులు మర్చిపోయింది. ఓ బ్యాగులో 3.5 తులాల బంగారు చైన్, లాప్‌టాప్ ఉన్నాయి. దాంతో సుమంజలి వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఫోన్‌పే ఐడీ ద్వారా ఫోన్ నెంబర్‌ను గుర్తించి ఆటో డ్రైవర్‌కు ఫోన్ చేశారు. ఆటోలో ప్రయాణికురాలి బ్యాగులు ఉన్నాయని గుర్తించిన ఆటోడ్రైవర్ రమేష్ బ్యాగులు తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నాడు. బ్యాగులో ఉన్న నగలు లాప్‌టాప్ సుమంజలికి అప్పగించారు. ఆటోడ్రైవర్ నిజాయితీతో వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌కి వచ్చిఇచ్చినందుకు గాను ఆయనను ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, డీఐ భూక్యా రాజేష్ అభినందించారు.